క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యదర్శిగా వీరభద్రరావు



పెదపూడి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా రాజుపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాగుమళ్ల వీరభద్రరావు(రావు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలపై ఈ నియామకం చేపట్టారు. కాగా.. వీరభద్రరావుకు పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పలువురు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

అధ్వానంగా హిందూ శ్మశాన వాటిక



కోరుకొండలోని హిందూ శ్మశాన వాటిక దుస్థితి

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండలో హిందూ శ్మశాన వాటిక అధ్వానంగా మారింది. ఇక్కడ కనీస వసతులు కూడా లేకపోవడంతో అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఎండల సమయంలో పర్వాలేదు గానీ, వానలు పడితే మాత్రం పరిస్థితి దారుణంగా మారుతోంది. వర్షం పడితే జిగురుమట్టి కారణంగా నడవటానికి కూడా వీలుండడం లేదు. మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకొచ్చేవారు నడవడానికి కూడా అవస్థలు పడుతున్నారు. శ్మశానవాటికలో పచ్చగడ్డి, తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి.

వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ

బిక్కవోలు: రేషన్ డీలర్లు తప్పనిసరిగా ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీలోపు 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ఇళ్లకు వెళ్లి రేషన్ అందించాలని తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 3,044 కార్డులకు ఇంటికి వెళ్లి రేషన్ ఇవ్వాలన్నారు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వం నిర్దేశించిన వేళల్లో రేషన్ షాపులు తెరవాలన్నారు. కార్డుదారులకు రేషన్ పంపిణీ విషయంలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంఎస్‌వో రంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ



నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లోని ప్రాథమిక తరగతులకు చెందిన విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలు అందజేశారు. వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుడు హేమంత్ కుమార్, బొబ్బిల్లంక హైస్కూల్ ఉపాధ్యాయిని మాచారమ్మ దంపతులు 25 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోలా సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో ఆక్రమణల తొలగింపు



ఎస్సీ కాలనీ నుంచి మురుగునీరు పోవడానికి ఏర్పాటు చేసిన కాలువ

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని ఎస్సీకాలనీలో పంచాయతీ కార్యదర్శి వెలిచేటి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కాలనీలో ఆక్రమణల కారణంగా వర్షం నీరు, మురుగునీరు బయటకు పోవడానికి అవకాశం లేక ఆ ప్రాంతమంతా ముంపునకు గురవుతోంది. దీంతో జేసీబీ సాయంతో ఆక్రమణలను తొలగించారు. అనంతరం కాలనీ నుంచి పరిమి వారి చెరువు, ఆత్రేడు చెరువులోకి మురుగు నీరు పోవడానికి కాలువ నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్వో దుర్గ, వీఆర్ఏలు సత్తిబాబు, గంగాధర్, వీరబాబు, జూనియర్ సెక్రటరీ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కాపాడితేనే ఆదాయం

- పశుపోషణతో అదనపు రాబడి
- మేత విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- పోషకాహారంతో అనేక ప్రయోజనాలు
- పాడి రైతులకు పశుసంవర్థక శాఖ అధికారుల సూచనలు



కొంకుదురులోని ఒక షెడ్డులో గేదెలు

బిక్కవోలు: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వ్యవసాయం ప్రధాన వృత్తి అయినప్పటికీ, దానికి అనుసంధానంగా పశువులను కూడా పెంచుతారు. తద్వారా అదనపు ఆదాయం పొందటానికి వీలుంటుంది. వ్యవసాయం ద్వారా సీజన్ల వారీగా ఆదాయం రాగా, పశుపోషణతో ప్రతి నెలా వచ్చే వీలుంటుంది. అయితే పశువుల విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకుంటేనే అవి సక్రమంగా పాలు ఇస్తాయి. అనారోగ్యం భారిన పడకుండా ఉంటాయి. ప్రస్తుతం వానాకాలం కావడంతో పశువులను అనేక రోగాలు ఆశించే ప్రమాదం కూడా ఉంది. పశు సంపద అభివృద్ధి చెందాలంటే వాటికి పోషకాలతో కూడిన ఆహారం ఇవ్వడం చాలా అవసరం. అంటే తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు పదార్థాలు, ఖనిజ లవణాలు, విటమిన్లు, నీరు అవసరమవుతాయి.

మాంసకృత్తులు

పశువుల శరీర నిర్మాణానికి, పెరుగుదలకు, రోగ నిరోధక శక్తికి మాంసకృత్తులు తోడ్పడతాయి. శరీరానికి శక్తిని సరఫరా చేస్తాయి. పెయ్యల ఎదుగుదలకు, పాడి పశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు బక్కచిక్కపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా ఉండడం, ఆలస్యంగా యుక్త వయసుకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి, మాంసం పొడి వంటి ముడి పదార్థాలు పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

పిండి పదార్థాలు

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు, అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి పిండి పదార్థాలు కాపాడుతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడంతో పాటు ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంసకృత్తుల కంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైనది. ఒక గ్రాము కొవ్వు పదార్థం సుమారు 9 కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని ప్రసాదిస్తుంది. వేరుశనగపిండి, కొబ్బరి పిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడు వంటి వాటిలో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

నీరు లేకుండా ఐదు రోజులు

మేత లేకుండా పశువులు మూడు నెలల పాటు బతకగలిగినా, నీరు లేకుండా ఐదు రోజులకు మించి ఉండలేదు. శరీర జీవన ప్రక్రియకు, ఉత్పాదకతకు నీరు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలను శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ కొనసాగడానికి, శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉండేందుకు, చర్మం సాగే గుణం కలిగి ఉండడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జన క్రియకు దోహదపడుతుంది. పశువులకు నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడకుండా పశువుల డీహైడ్రేషన్ గురై మరణిస్తాయి. కాబట్టి నీరు కూడా పశువులకు అత్యవసరమయ్యే పోషక పదార్థాల్లో ఒకటిగా గుర్తించాలి. పశువులు తాగేందుకు రోజుకు 50–60 లీటర్లు నీరు అవసరం.

వానాకాలంలో జాగ్రత్తలు



వర్షాకాలంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే చిటిక వ్యాధి, నీలి నాలుక వ్యాధి, పారుడు, కాళ్ల డెక్కల వ్యాధి, శ్వాసకోశ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. గొర్రెలు, మేకలను వర్షం బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేసి, వాటిని న్యూమోనియా నుంచి కాపాడుకోవాలి. వ్యాధి సోకిన వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి. వ్యాధులు సోకిన గొర్రెలు, మేకలను మందలో కలపకూడదు. ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు. గొర్రె, మేక మృతి చెందితే వాటి కళేబరాలను ఊరికి దూరంగా తీసుకెళ్లి లోతుగా గొయ్యి తవ్వి పూడ్చి పెట్టాలి. నీటి పాత్రలను క్రిమిసంహారక మందులతో శుభ్రం చేసి ఎండలో ఆరబెట్టాలి. మూగజీవాలకు ఏ వ్యాధి సోకినా దగ్గరలోని పశు వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించాలి.

– డాక్టర్ శ్రీనివాస్, పశుసంవర్థక శాఖ ఏడీ, అనపర్తి

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

అనపర్తి: రాజమహేంద్రవరంలోని కాతేరు రోడ్డులో ఉన్న వెంకటాద్రి ఫంక్షన్ హాలులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ సీపీ సమావేశం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, శాసన మండల సభ్యుడు బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలో పార్టీ మండల కన్వీనర్లు, మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సోషల్ మీడియా కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో జలాభిషేకం



సోమేశ్వరస్వామికి జలాభిషేకం చేస్తున్న అర్చకులు

పెదపూడి: గ్రామంలోని ప్రాచీన శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం జలాభిషేకం, పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక, విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకుడు కొమ్మనపల్లి వెంకట్రావు మాట్లాడుతూ వర్షాలు సరిపడినంత సకాలంలో కురువాలని, వ్యవసాయం బాగా జరగాలని కోరుకుంటూ జలాభిషేకం నిర్వహించామన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్ఎం పార్థసారథి తదితరులు

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు బి.బుల్లెమ్మ, సీహెచ్ఏఎల్ శేషుకుమారి, జి.అనితారాణి, ఎం.సత్యదేవిలను గురువారం ఆ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు వి.పార్థసారథి మాట్లాడుతూ అంకితభావంతో సేవలు అందించి, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో, పాఠశాలను మండలంలో ప్రథమ స్థానంలో నిలపడంలో ఉపాధ్యాయులు అందించిన సేవలు అభినందనీయమన్నారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చార్లెస్, జాకబ్, గణేష్, ఓమి ప్రసాద్, శైల, స్వాతికుమారి, సావిత్రి, రమ్యసుధ, వరలక్ష్మి, భారతి, కామేశ్వరి, సీఆర్‌ఎంటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దుర్గబాబు

రంగంపేట: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా చేపట్టాలని ఐటీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వావ్ ప్రోగ్రాం స్కూల్ కో ఆర్డినేటర్ పి.దుర్గబాబు పిలుపు నిచ్చారు. స్థానిక ఎస్‌వీఎస్ స్కూల్ ఆవరణలో హెచ్ఎం కేవీవీఎస్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో గురువారం వావ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ చాంపియన్‌షిప్ కార్యక్రమంలో పాత పుస్తకాలు, పేపర్లు సేకరించి, దానికి తగిన విద్యా సామగ్రిని అందించారు. ప్రతి ఒక్కరూ రీసైకిలింగ్‌కు సహకరిస్తే చెట్లను కాపాడుకోవచ్చునని ఆయన సూచించారు. అనంతరం వావ్ ప్రోగ్రాంలో స్కూల్ టాపర్‌గా నిలిచి ఇంటర్ స్కూల్ చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకున్న సోహిత జ్ఞానసాయికి ట్రోఫీని, వివిధ తరగతుల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు, పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఏజీఎస్ కో ఆర్డినేటర్ ఎస్.రాముడు ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలోనూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

సంపద కేంద్రాలను వినియోగించుకోవాలి



పైన గ్రామంలో తడి, పొడి చెత్త విధానంపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై పైన, పెద్దాడ గ్రామాల్లో ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తడి, పొడి చెత్తను క్లాప్ మిత్రాలకు అందివ్వాలన్నారు. బిన్ను బ్యాగ్ పద్ధతిలో వారానికి మూడు సార్లు తడి చెత్త, వారానికి ఒక రోజు పొడి చెత్తను వారు సేకరిస్తారన్నారు. ఆ చెత్తను ఇక్కడకు తీసుకువచ్చి తడి చెత్తను ఎరువుగా, పొడి చెత్తను రీసైకిల్ చేస్తారన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు ఈ కేంద్రానికి తరలించడంతో గ్రామం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు వర్మ, భాను తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

రాజానగరం: రాష్ట్రంలో అటవీ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మండలంలోని దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు ఏరియాలో స్టేట్ ఫారెస్టు అకాడమీ ఏర్పాటుకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ భూముల పరిరక్షణ, అడవుల సంరక్షణలో శాస్త్రీయ నైపుణ్యాన్ని పెంపొందించే దిశగా సిబ్బందికి అవసరమైన శిక్షణమే లక్ష్యంగా అకాడమీ పనిచేస్తుందన్నారు. ఇందుకోసం అకాడమీకి 12 ఎకరాల విస్తీర్ణంలో రూ.18.34 కోట్ల వ్యయంతో భవన సముదాయాలను నిర్మించనున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, కలెక్టరు పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ పాల్గొన్నారు.

మా అమ్మాయి కనిపించడం లేదు

14 ఏళ్ల తమ అమ్మాయి ఈ నెల 8వ తేదీ నుంచి కనిపించడం లేదని, ఎవరో కిడ్నాప్ చేశారని అనుమానంగా ఉందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కాకినాడ జిల్లా కరపకు చెందిన ఆ బాలిక తల్లిదండ్రులు మొరపెట్టుకున్నారు. దివాన్ చెరువులోని ప్రాంతీయ అటవీ పరిశోధన కేంద్రం వద్ద స్టేట్ ఫారెస్టు అకాడమీ ఏర్పాటుకు శంకుస్థాపన చేసేందుకు గురువారం వచ్చిన ఆయనకు ఈ విషయం విన్నవించారు. రాజస్థాన్ నుంచి వచ్చిన 18 ఏళ్లుగా కరపలో ఉంటున్నామని, అదే గ్రామానికి చెందిన 24 ఏళ్ల బుద్దాల మణికంఠపై అనుమానంగా ఉందన్నారు.

వీధి దీపాలు వెలగక అవస్థలు

బిక్కవోలు: బిక్కవోలులోని వీర్రాజు పేటలో వీధి దీపాలు వెలగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 15 రోజులుగా ఈ సమస్య ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పాములు ఎక్కువగా తిరుగుతూ ఉంటాయని, వీధి దీపాలు కూడా వెలగక పోవడంతో భయాందోళన చెందుతున్నామన్నారు. నాలుగు రోజులు వర్షాలు కురవడంతో చాలా ఇబ్బంది కలుగుతోందన్నారు. అధికారులు స్పందించి, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు



సీతానగరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు



రంగంపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్య, మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కొందరు యువత మత్తు పదార్థాలను బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆరోగ్యం, జీవితం, కుటుంబ పరువును పోగొట్టుకుని కన్నవారికి, ఆత్మీయులకు శోకం మిగులుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరే రామకృష్ణ మాట్లాడుతూ యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకుంటే, మానసిక శక్తి పెరిగి నైతిక విలువలు పాటించే సంయమనం విద్యార్థులకు అలవడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, కళాశాల ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామమైన నాగరత్నం కాలనీ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రంగంపేట: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సుధ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత మత్తుకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ అలవాటు అత్యంత ప్రమాదకరమన్నారు. యువత జీవితంలో లక్ష్యం ఏర్పరచుకుని, దాని సాధనకు కృషి చేయాలన్నారు. మత్తు, మాదక ద్రవ్యాల సమాచారాన్ని తమకు తెలియజేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించి, మాదక ద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రతిజ్ఞ చేయించారు. మద్యం, మాదక ద్రవ్యాల నుంచి యువతను కాపాడుకుందా, నవ భారత నిర్మాణం సాధిద్దామంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఆలయ భూమికి కౌలు వేలం

పెదపూడి: చింతపల్లిలోని వీరేశ్వరస్వామి ఆలయ భూమి కౌలుకు గురువారం వేలం పాట నిర్వహించారు. ఆలయ వద్ద జరిగిన ఈ వేలంలో 3.64 ఎకరాలను గ్రామానికి రైతు ఏడాదికి రూ.1.87 లక్షలు చెల్లించేలా, మూడేళ్ల పాటు సాగు చేసుకునేలా పాట దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ వడ్డాది సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో రూ.76 వేలు ఉండగా, ఈసారి రూ.మరో రూ.1.11 లక్షలకు పెరిగిందన్నారు.

కిరాణా పట్టీకి విరాళం

రాజానగరం: గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో ప్రతి గురువారం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటి వరకూ కిరాణా పట్టీ బకాయి రూ.65,633 ఉంది. ఈ నేపథ్యంలో గురువారం నీలపాల సుబ్రహ్మణ్యం తన తల్లిదండ్రుల పేరున కిరాణా పట్టీ బకాయిని విరాళంగా చెల్లించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వారాహి గుప్త నవరాత్రులు ప్రారంభం



విశేష అలంకరణలో వారాహి అమ్మవారు

సీటీఆర్‌ఐ: గాడాల గ్రామంలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో గురువారం వారాహి అమ్మవారి గుప్త నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి దర్శనానికి రాజమహేంద్రవరం చుట్టు పక్కల నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు మాట్లాడుతూ మహాలక్ష్మీ అమ్మవారు వారాహీదేవిగా జూలై 10వ తేదీ ఉదయం 9 గంటల వరకూ దర్శనమిస్తారన్నారు. ఈ గుప్త నవరాత్రుల్లో ప్రతిరోజు విశిష్ట పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. పీఠంలో వారాహీ రక్ష తయారు చేస్తున్నామన్నారు. జూలై 10వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 108 కేజీల గంధంతో మహాభిషేకమాచరించి అమ్మవారి రక్ష ప్రసాదంగా భక్తులకు అందజేస్తామని తెలిపారు.

కడియంలో..

కడియం: మండల కేంద్రమైన కడియంలోని భ్రమరాంబిక మల్లేశ్వరస్వామి ఆలయంలో వారాహీదేవి నవరాత్రులను గురువారం ప్రారంభించారు. ఆలయ అర్చకుడు అప్పలి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పిల్లలకు ప్రేరణ కలిగించే అంశాలకు ప్రాధాన్యం



పుట్టకొండలో చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రముఖులు

పెదపూడి: పిల్లల మెదడులో ప్రేరణ కలిగించే అంశాలపై తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ సంపర సెక్టార్ సూపర్ వైజర్ శ్రీపద్మ అన్నారు. పుట్టకొండ గ్రామంలోని 10వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నవచేతన ప్రాధాన్యతపై కార్యక్రమం నిర్వహించారు. శ్రీపద్మ మాట్లాడుతూ బ్రెయిన్ డెవలప్‌మెంట్ కోసం పిల్లలకు ప్రేరణ ఏ విధంగా ఇవ్వాలో తల్లిదండ్రులకు వివరించారు. మూడేళ్ల లోపు పిల్లలకు 75 శాతం, ఆరేళ్ల లోపు 95 శాతం బ్రెయిన్ డెవలప్‌మెంట్ జరుగుతుందన్నారు. అనంతరం చిన్నారులకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలను గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఐదేళ్లు నిండి ప్రాథమిక పాఠశాలలో చేరిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రీస్కూలు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. డ్రగ్స్ రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి అందరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు దెయ్యాల నారాయణరావు, ఉప సర్పంచ్ మిరియాల శ్రీను, గ్రామ పెద్దలు కేతా శ్రీను, సత్యవతి, మహాలక్ష్మి, కేతా సత్యనారాయణ, ఫణీంద్ర పాల్గొన్నారు.

రహదారి శిథిలం.. ప్రయాణం భయం



రఘుదేవపురంలో పాడై ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

- అధ్వానంగా రోడ్డు
- మరమ్మతులకు గురై ఆగిపోతున్న బస్సులు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

సీతానగరం: రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లేన్ల రోడ్డులో రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ రహదారి అధ్వానంగా మారింది. అలాగే సీతానగరం – పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డు శిథిలం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ముఖ్యంగా ఈ రోడ్డులో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దారిలో సడెన్‌గా ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రఘుదేవపురంలోని యూనియన్ బ్యాంకు సమీపంలో రాజమహేంద్రవరం నుంచి సీతానగరం వస్తున్న ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురై నిలిచిపోయింది. దానిలోని ప్రయాణికులను వేరే బస్సులో తరలించారు. అలాగే సీతానగరం – పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డుకు గత నెలలో శంకుస్థాపన చేసినా, ఇంతవరకూ పనులు చేపట్టలేదు. ఈ రోడ్డులో తిరుగుతున్న వాహనాలు కూడా పాడైపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లేన్ల రోడ్డును రఘుదేవపురం శివారు వరకూ నిర్మించారు. కాటవరం, మునికూడలి, ముగ్గళ్ల వద్ద కల్వర్టులకు రోడ్డును కలపాల్సి ఉంది. కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టిన తక్షణమే కల్వర్టులను కలుపుతారని, రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేస్తారని ఎదురు చూసిన మండల ప్రజలకు నిరాశ ఎదురైంది. రోడ్డు విషయంలో ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు.